క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య ట్రాన్స్‌పోర్ట్ వాహనాల డ్రైవర్లు, ఓనర్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. వాహనాలు నడుపుతున్నప్పు డ్రైవర్లు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే పలు అంశాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు తెలిపారు. భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, ఓనర్లు రవాణా శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

సరోజిని నాయుడు జయంతి


సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టీఎన్జీఓస్ ప్రెసిడెంట్, సెక్రెటరీ డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో సరోజిని నాయుడు జయంతిని పురస్కరించుకుని గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలకు కొనియాడారు. కృష్ణ, శ్రీనివాస్, అంజిబాబు, హరీష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెద వాగు ప్రాజెక్ట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల(దమ్మపేట)లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సింధుశ్రీ చేతుల మీదుగా సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రేడియో దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు రేడియో ప్రాముఖ్యత వివరించారు. అధ్యాపకులు ప్రసాద్, ఎం.అరుణ, పి.భవాని, ఉమా, సుధారాణి పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని శ్రీ భూ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం సామూహిక వ్రతాలు వైభవంగా జరిగాయి. గణపతి పూజ,నవగ్రహ పూజల అనంతరం వ్రతాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గ్రామ పుర వీధులలో కోలాట నృత్యాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధ్యాన శిక్షణ తరగతులు


రమణను సత్కరిస్తున్న గ్రామస్తులు

ములకలపల్లి: మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఆవాస విద్యాలయం ఆవరణలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, రామచంద్రా మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధ్యాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. రెండో రోజైన గురువారం 'నిర్మలీకరణ అంతఃకరణశుద్ధి ప్రక్రియ' అనే అంశంపై విశ్రాంత ఉద్యోగి రమణ గురుజీ తరగతులు బోధించారు. అనంతరం గురుజీని గ్రామస్తులు సత్కరించారు. ప్రసాద్, ప్రభాకర్, పిచ్చేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, మేకల పెద్ద వెంకన్న, బండి కొమరయ్య. సీతారాములు, పద్దం బుజ్జి, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, పుష్పాల సాయి, పద్మ, రాజు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలోని సమ్మక్క–సారక్క ఆలయ సన్నిధిలో నాగులమ్మ ఆలయ ధ్వజస్తంభాన్ని గురువారం ప్రతిష్ఠించారు. ఆలయ దేవర బాలలు సోడే శాంతమ్మ, మడకం అచ్చమ్మ, తిమ్మ శాంతమ్మల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీ పాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, బీఆర్ఎస్ భద్రాచలం కన్వీనర్ అకోజు సునీల్, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన..

చంద్రుగొండ: అన్నపురెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో ముత్యాలమ్మతల్లి, పెద్దమ్మతల్లి, పోతురాజు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చక బృందం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ప్రత్యేక హోమాలు, పూజలు శాస్త్రోక్తంగా సాగాయి. శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో వేంచేసియున్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణ ప్రముఖులు రంగ శ్రీనివాసరావు–ఉదయశ్రీ దంపతులు సాయినాథుడిని దర్శించుకుని అన్నదానం అందించారు. ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లు సరే.. బస్సులు ఏవి?

- ఏజెన్సీలో పల్లె వెలుగు సర్వీసులు నిల్
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న సరిహద్దు గ్రామాల గిరిజనులు
- పక్కా రహదారులు ఉన్నా ముందుకు రాని అధికారులు


బస్సులు నడిచేందుకు అనువుగా ఉన్న కుర్నపల్లి రహదారి

చర్ల: ఏళ్ల తరబడిగా ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా వారి మొరను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు. దీంతో ఇక తమ పరిస్థితి ఇంతేనేమో.. మా బాధలు పోయే దారులు లేవేమోనని సరిహద్దున ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్ల మండల సరిహద్దున ఉన్న గిరిజన గ్రామాలకు ఏళ్ల తరబడిగా బస్సులు లేవు. బస్సులను నడిపేందుకు రహదార్లు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. గతంలో ఈ గ్రామాలకు రహదార్లు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఆసక్తిని చూపలేదు. అయితే ఆయా గ్రామాలకు గడిచిన ఏడేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి రహదార్లను ఏర్పాటు చేశాయి. అయినప్పటికీ బస్సుల జాడ లేదు.

సర్వీసులకు డిమాండ్..

ఇక్కడి ప్రతి రహదారిలోనూ కనీసం 10 గ్రామాలు ఉండగా ఆ గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది వారివారి అవసరాలను తీర్చుకునేందుకు మండల, డివిజన్ కేంద్రాలకు వచ్చిపోతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో చదువులు సాగించే విద్యార్థులకు బస్సు సర్వీసులు చాలా అవసరంగా ఉంది. ప్రస్తుతం వీరు కిలోమీటర్ల కొద్దీ నడిచి రావడం, సైకిళ్లపై రాకపోకలు ద్వారా చదువులను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు చదువులకు కూడా దూరమవుతున్నారు. వీరికితోడు మారుమూల గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా బస్సు సౌకర్యం లేకపోవడంతో అతికష్టం మీద వారి స్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

ప్రైవేట్ వాహనాలతో ప్రమాదాలు

బస్సుల సర్వీసులు లేని క్రమంలో పల్లెల్లోని ప్రయాణికులు మైదాన ప్రాంతాలు, మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు వెళ్లొచ్చేందుకు ఆటోలు ట్రాలీలు, బొలేరోలు, ట్రాక్టర్లు వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వారి రాకపోకలకు ప్రస్తుతం అవే దిక్కయ్యాయి. ఈ క్రమంలో పలు సందర్భాలలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా సంఘటనల్లో కొందరు క్షతగాత్రులవుతూ ఉంటే ఇంకొందరు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. బస్సులు నడిపేందుకు రహదార్లు అనువుగా ఉన్నప్పటికీ రవాణాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

బస్సులకు అనువైన రూట్లు..

- చర్ల మండలం ఆర్ కొత్తగూడెం నుంచి బోదనెల్లి, కుర్నపల్లి, పులిగుండాల గ్రామాల మీదుగా దుమ్ముగూడెం మండలంలోని సీతానగరం వరకు..
- కలివేరు నుంచి తిప్పాపురం మీదుగా బీజాపూర్ జిల్లాలోని పామేడు వరకు..
- చర్ల నుంచి ఉంజుపల్లి మీదుగా పూసుగుప్ప వరకు..
- దండుపేట నుంచి మొగళ్లపల్లి, జీపీపల్లి మీదుగా సీ కత్తిగూడెం వరకు..

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం..



బస్సుల కోసం ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్నాం. రోడ్లు లేని సందర్భంలో రోడ్లు లేవని బస్సులు నడపలేదు. కానీ ఇప్పుడు రోడ్లు ఉన్నప్పటికీ బస్సులు రాకపోతుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలన్నింటికీ బస్సులు నడపాలి.

– మడకం చందు, ఎర్రంపాడు

బాధలు తీరే దారి ఏది?



మాకు బస్సుల బాధలు తీరే దారి కనిపించడం లేదు. ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఎక్కిన సందర్భంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. దీనికితోడు వారు అధికంగా వసూలు చేస్తున్నారు. మా గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపితే మా ఇబ్బందులు తొలుగుతాయి.

– ఉంగయ్య, చెన్నాపురం

ఉత్తమ పాఠశాల 'వైట్‌నగరం'


బాలమేళాలో మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్

దుమ్ముగూడెం: బాలమేళా కార్యక్రమంలో భాగంగా నరసాపురం కాంప్లెక్స్ పరిధిలో ఉత్తమ పాఠశాలగా వైట్ నగరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అవార్డు అందుకుంది. ఈ మేరకు ప్రోగ్రామ్ నోడల్ అధికారి, కాంపెక్స్ హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రకటించారు. వైట్ నగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దశమ్ బాబుకు ఆయన షీల్డ్, ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 24 పాఠశాల ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ దుర్గారావుతో పాటు బాలమేళా రిసోర్స్ పర్సన్ టీం పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో..

నర్సాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి బాలోత్సవాన్ని మండల అధికారుల బృందం గురువారం ప్రారంభించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మామిడి అశోక్, ఎంఈఓ సున్నం సమ్మయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామకృష్ణలు మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రత్నకుమారి, నర్సాపురం కాంప్లెక్స్ అసిస్టెంట్ కార్యదర్శి కారంపూడి దశం బాబు, రిసోర్స్ పర్సన్ చిగురుమల శ్రీనివాస్, కిషన్, శ్రీనివాసరావు, ఆశాలత, నాగరాజు, దుర్గారావు, 24 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వనరులను దోసుకెళ్తే సహించం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన చట్టాలను తుంగలో తొక్కి కిన్నెరసాని నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈసాల సురేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వోల్టా, పెసా, 1/70 చట్టాలను ఉల్లంగిస్తూ, అనుమతులు లేకుండా ప్రభుత్వానికి ఇసుక వ్యాపారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో పెసా కోఆర్డినేటర్ల చేత చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి సోలం రామారావు, జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర, గుండాల, మణుగూరు, టేకులపల్లి కార్యదర్శులు పూనెం రమణబాబు, కంగల ప్రవీణ్, కోరం సమ్మయ్య, సుధాకర్, జబ్బా సుదర్శన్, కొడెం రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష

చంద్రుగొండ: అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై డిప్యూటీ తహసీల్దారు జగదీశ్వరి ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహాలక్ష్మి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆలయ మేనేజర్ పీవీ రమణ పాల్గొన్నారు.

వృక్ష కల్యాణ మహోత్సవం


లక్ష్మీనారాయణ స్వామి వృక్ష కల్యాణంలో పాల్గొన్న ఏరియా జీఎం, అధికారులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో లక్ష్మీనారాయణ స్వామి వృక్ష కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్లాంట్ సమీపంలోని ఓంకారేశ్వరి దేవి ఆలయంలో లక్ష్మీనారాయణ స్వామి వృక్ష కల్యాణ మహోత్సవం (రావిచెట్టు–నారాయణ స్వామి, వేప చెట్టు–లక్ష్మీదేవి) కనుల పండువగా నిర్వహించారు. నారాయణస్వామి, లక్ష్మీదేవి విగ్రహాలను సైట్ ఆఫీస్ నుంచి ఆలయం వరకు మేళతాళాలతో అధికారులు, కార్మికులు ఊరేగింపుగా తీసుకు రాగా.. వేద మంత్రోచ్ఛరణలతో పూజారులు కల్యాణం నిర్వహించారు.జీఎం దుర్గం రాంచందర్, ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్‌లు అతిథులుగా హాజరై కల్యాణ వేడుకను తిలకించారు. అనంతరం కార్మికులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయగా, కార్మికులు, వారి కుటుంబాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో అధికారులు మదన్‌నాయక్, ఇంజనీర్లు గౌడ, సందీప్, రామకృష్ణ, మల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సూపర్‌వైజర్లు అజిత్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు కార్మిక సంఘాల నాయకులు నాగరాజు(ఏఐటీయూసీ), వత్సవాయి కృష్ణంరాజు (ఐఎన్‌టీయూసీ), నాగెల్లి వెంకట్ (టీబీజీకేఎస్), శ్రీకాంత్ (సీఐటీయూ), నాజర్‌పాషా (ఇఫ్టూ), బీఎంఎస్, హెచ్ఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ స్మారక ఫలకం ఆవిష్కరణ

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామ దివంగత సర్పంచ్ తేజావత్ సూర్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా అంజనాపురం గ్రామంలో ఆయన జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు కళావేదిక, స్మారక శిలా ఫలకాన్ని ఏర్పాటు చేయగా.. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. సూర్యం చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. మోరంపల్లిబంజర సర్పంచ్‌గా ఐదుసార్లు పనిచేసిన నిస్వార్థ సేవకుడు సూర్యం అన్నారు. కార్యక్రమంలో సూర్యం కుమారులు తేజావత్ కృష్ణ, జానకీరామ్ పాల్గొన్నారు.

మసీదు కమిటీ ఏకగ్రీవం

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న జామా మసీద్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మసీదులో ఏర్పాటు చేసిన మత పెద్దల సమావేశంలో, మసీద్ కమిటీ నూతన అధ్యక్షుడిగా షేక్ షబ్బీర్ అహ్మద్, కార్యదర్శిగా సయ్యద్ వలీ, కోశాధికారిగా షేక్ ఇమ్రాన్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మసీదు కమిటీకి స్థానిక ముస్లిం పెద్దలు అభినందనలు తెలిపారు.

పరిమితికి మించి నియమించొద్దు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల టెండర్‌లో పరిమితికి మించి కాంట్రాక్ట్ కార్మికులను నియమించొద్దని సామాజిక కార్యకర్త కర్నె బాబు గురువారం ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేశారు. మూడు మస్టర్‌లకు నలుగురు పనిచేస్తున్నారని, వైద్యుడి సిఫారసుతో గతంలో పనిచేశాడని చెబుతూ ఐదో వ్యక్తిని నియమించారని వినతిలో పేర్కొన్నారు. దీనివల్ల ఒక్కో కార్మికుడికి నెలకు 20 మస్టర్లు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రూనింగ్ చేపట్టాలి

ములకలపల్లి: తునికాకు ప్రూనింగ్ పనులను సత్వరమే చేపట్టాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ములకలపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. పొడియం వెంకటేశ్వర్లు, గద్దం వెంకటేశ్వర్లు, వినోద్ పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చా నరసింహారావు అత్తయ్య, దుమ్ముగూడెం మండలం ములకపాడుకు చెందిన మంగమ్మ ఇటీవల మృతి చెందగా గురువారం దశదినకర్మకు మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హాజరయ్యారు. మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, తూము వీరరాఘవులు, బచ్చు వెంకటరమణ, సామకూరి వెంకన్న, బారాజు సంపత్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలి


అవగాహన కల్పిస్తున్న మణుగూరు ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మోహిద్దీన్

అశ్వాపురం: అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మణుగూరు ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మోహిద్దీన్ అన్నారు. మండల పరిధిలోని ఎలకలగూడెం, గొందిగూడెం కొత్తూరు గ్రామాలలో గురువారం అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. బండ్లవారిగుంపులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవి చుట్టుపక్కల గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని, అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం రేంజ్ ఆఫీసర్ రమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ధనలక్ష్మి, వెంకట్రావు, బీట్ ఆఫీసర్లు బాబురావు, వాణి, సునీల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నేతలతో సమావేశం


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్

చంద్రుగొండ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అశోక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు, ఒక జెడ్పీటీసీ స్థానానికి గాను 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 23,893 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల నేతలు వారాది సత్యనారాయణ, పెద్దిని వేణు, కీసరి కిరణ్ కుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ


కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీడీపీఓ ముత్తమ్మ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమల కుంట గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం అశ్వారావుపేట సీడీపీఓ ముత్తమ్మ ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో ఉన్న స్టాక్, లబ్ధిదారులకు అందించే ఫీడింగ్, కోడి గుడ్లు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మెనూ ప్రకారం ఫీడింగ్, పోషకాహారం అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మ, వరలక్ష్మి, సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, విజయ, వాణి, ఆయాలు పాల్గొన్నారు.

ఆర్థిక 'చేయూత'


ఆర్థిక సాయం అందిస్తున్న చేయూత ట్రస్ట్ ప్రతినిధులు

బూర్గంపాడు: మండల పరిధిలోని కొమ్ముగకిరిపేట గ్రామానికి చెందిన బాడిశ బాలకృష్ణ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా.. వైద్య ఖర్చుల నిమిత్తం మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ గురువారం రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందించింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ కైపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు కొండ్రు వెంకటేశ్వర్లు, గాదె నర్సిరెడ్డి, చిన్ననాగిరెడ్డి, మల్లేశ్వరరావు, ఆదిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన సదస్సు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని లంక మల్లారం గ్రామపంచాయతీలో ఉన్న టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ.. కుష్ఠు లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సత్తెమ్మ, హెచ్ఈ పరంగిని, హెచ్ఎస్ జానకి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మోటారు ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ కొత్తూరు వద్ద వాగులో ఉన్న బోరుకు తాగునీటి నిమిత్తం గురువారం మోటారు బిగించారు. పెదవాగులో ఉన్న ఫిల్టర్‌పాయింట్ బోరుకు సంబంధించిన మోటారు కొద్ది నెలల క్రితం మరమ్మతులకు గురి కావడంతో.. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచన మేరకు కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్ మోటారు ఏర్పాటుకు రూ.30వేలను అందించారు. ఈ నగదుతో మోటారును బిగించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. సమస్యను పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.బాబా, అనపర్తి సత్యనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామశివారులో ఉన్న కట్టమైసమ్మ తల్లి ఆలయం, నారంవారిగూడెం కాలనీ గ్రామంలోని విజయదుర్గ భవాని అమ్మవారి ఆలయాల్లో గురువారం భక్తులు పూజలు చేశారు. అమ్మవారిని స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు నిత్యపూజలు, అష్టోత్తర కలశ ఆరాధన, అభిషేకాలు చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, చందా లక్ష్మీనర్సయ్య, చందా కుమారస్వామి, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

గద్దెలకు చేరిన వనదేవతలు


సమ్మక్క తల్లిని గద్దెల వద్దకు తోడుకొని వస్తున్న గిరిజనులు


మణుగూరురూరల్: వనదేవతలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయం దంపతుల

చర్ల: చినమేడారంగా ప్రసిద్ధిగాంచిన ఎదిరగుట్టలో సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా రెండో రోజు గురువారం సమ్మక్కను గద్దెకు చేర్చారు. సమీపంలోని గుడంతోగు గుట్టల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి సమ్మక్క తల్లిని మేళతాళాలు, డప్పువాయిద్యాలు, గిరిజనుల పూనకాల నడుమ గద్దెల వద్దకు చేర్చారు. ఆలయ పూజారి పూనెం సమ్మయ్య నేతృత్వంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు, దేవరబాలల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక, ఇతర రాష్ట్రాల భక్తులు సైతం పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ప్రధాన రహదారి, అటవీ ప్రాంతమంతా భక్తులతో నిండిపోయింది. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం జాతరలో పాల్గొన్నారు.వారిలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తదితరులు ఉన్నారు.

తోగ్గూడెం మినీమేడారం జాతర..

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం మినీమేడారంలో శ్రీసమ్మక్క–సారలమ్మల సుంకు జాతర అంగరంగ వైభవంగా జరుగుతోంది. గురువారం సమ్మక్క–సారలమ్మల జెండా కర్రలను గిరిజన సంప్రదాయాలతో మేళా తాళాల, డోలీ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గద్దెలకు తీసుకొచ్చారు. గిరిజన పూజారులు, శివసత్తులు, మహిళలు నృత్యాలు చేస్తూ పూనకాలు ఊగారు. అమ్మవార్లకు భక్తులు బంగారం(బెల్లం) సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. వనదేవతలు గద్దెలకు చేరడంతో మినీమేడారం భక్తజనసందోహంతో కళకళలాడింది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు–పాయం ప్రమీల దంపతులు వనదేవతలను దర్శించుకున్నారు. మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రంజిత్‌లు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.


దుమ్ముగూడెం: నాగులమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

మారాయిగూడెంలో ఎమ్మెల్యే..

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో ఉన్న సమ్మక్క–సారలమ్మలను బద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం దర్శించుకున్నారు. నాగులమ్మ దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠానకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జాతరలో పాల్గొన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు లంక అబ్బులు, మట్టా శివాజీ, కుంజా శ్రీను, తోటమళ్ళ సుధాకర్, అపకా శ్రీను, కోడి చంటి, లంక సంపత్ పాల్గొన్నారు.